

వృద్ధులకు, వికలాంగులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

వృద్ధులకు అందని రేషన్ బియ్యం సరఫరా అనే శీర్షికతో శనివారం ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. వికలాంగులకు, 65 ఏళ్లపైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే బియ్యం సరఫరా చేయాలన్న ప్రభుత్వ నిబంధనలు స్థానిక రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకపోవడంపై లబ్ధిదారులు ఆగ్రహం చేస్తున్నారంటూ ప్రచురితమైన వార్తకు రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. గ్రామంలో డీలర్ ద్వారా విఆర్ఓ పర్యవేక్షణలో వికలాంగులకు, వృద్ధులకు ఇంటికి వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. దీంతో వృద్ధులు, వికలాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రేషన్ అందిస్తున్న డీలర్

బాలింతలు బెంబేలు..!

> 'నల్లజర్ల మండలం ఘంటావారిగూడేనికి చెందిన మహిళ ప్రసవం కోసం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో నెల రోజుల క్రితం చేరింది. ఇప్పటికీ ఆమె ఆసుపత్రిలోనే ఉంది. ఇన్ఫెక్షన్ పేరుతో తాజాగా మరోసారి కుట్లు వేశారు. ఇంటికి ఎప్పటికి వెళ్తామో అంటూ బాలింత, ఆ కుటుంబం భయంతో వణికిపోతుంది.'

> 'ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లికి చెందిన గర్భిణి ఎనిమిది రోజుల క్రితం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రసవం కోసం చేరింది. కాన్పు జరిగి వారం రోజుల తర్వాత ఇన్ఫెక్షన్ అయ్యిందని, మరోసారి కుట్లు వేయాల్సి వస్తుందని చెప్పడంతో ఆమె బాధ వర్ణనాతీతంగా మారింది.'

ఏలూరు సర్వజన ఆసుపత్రి తల్లీబిడ్డల బ్లాక్‌లో పరిస్థితి దారుణం

బాలింతలకు ఇన్ఫెక్షన్ పేరుతో పదేపదే కుట్లు వేస్తుండటంతో నరకయాతన

సుమారు నెల రోజులు ఆసుపత్రిలోనే ఉంచేస్తున్నారని ఆందోళన

ఏడాదిగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పట్టించుకునే నాధుడు కరువు

ఆసుపత్రికి వచ్చేందుకు వణికిపోతున్న గర్భిణులు

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఇదే విషయం లేవనెత్తిన ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న బాలింతలే కాదు.. ఆసుపత్రిలో ప్రసవమైన బాలింతల్లో చాలామంది పరిస్థితి ఇదేవిధంగా ఉంది. ఆసుపత్రి నుంచి ఇంటికి ఎప్పటికి వెళ్తారో తెలియని అయోమయ స్థితిలో ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారమే ఆసుపత్రిలో ఉన్న బాలింతల్లో 12 శాతం మందికి ఇన్ఫెక్షన్ పేరుతో పదేపదే కుట్లు వేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారిక లెక్కల కంటే ఇది మరింత ఎక్కువగా ఉందని గర్భిణుల బంధువులు చెబుతున్నారు. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు ప్రసవాలు చేయడంలో తల్లీబిడ్డల ఆసుపత్రికి మంచి పేరు ఉంది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఎంతోమంది ఇక్కడకు తరలొచ్చి పండంటి బిడ్డలకు జన్మనిచ్చి సంతోషంగా తిరిగెళ్లేవారు. బోధనా ఆసుపత్రిగా మారిన తర్వాత పరిస్థితి మొత్తం తారుమారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని ఎంసిహెచ్ (తల్లీబిడ్డల విభాగం) బ్లాక్‌కు ప్రతిరోజూ కనీసం 150 మందికిపైగా గర్భిణులు వస్తుంటారు. వైద్యులు సరిపడా లేకపోవడంతో ఇక్కడ పరిస్థితి రోజురోజుకీ అధ్వానంగా మారుతోంది. దానికి తోడు ఇన్ఫెక్షన్ పేరుతో బాలింతలకు పదే పదే కుట్లు వేస్తున్న తీరు బాలింతలను, ఆయా కుటుంబాలను భయాందోళనకు గురిచేస్తోంది. ప్రతిరోజూ ఆరోగ్యశ్రీ ద్వారా పది మందికిపైగా గర్భిణులకు ప్రసవాలు జరుగుతుంటాయి. నిబంధనల ప్రకారం ఎనిమిది రోజులకు డిశ్చార్జి చేసి పంపించాలి. ఇక్కడ చేరిన గర్భిణులు ప్రసవం తర్వాత ఎన్ని రోజులకు తిరిగెళ్తారో చెప్పలేని పరిస్థితి ఉంది. ఇన్ఫెక్షన్ పేరుతో పదేపదే కుట్లు వేస్తుండటంతో రోజులు తరబడి ఆసుపత్రిలోనే మగ్గిపోతున్నారు. వేరే ఆసుపత్రికి తీసుకెళ్తాం.. పంపించేయండి బాబోయ్ అంటూ బాలింతల కుటుంబ సభ్యులు డాక్టర్లను వేడుకుంటున్న పరిస్థితి ఉంది.



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో తల్లిబిడ్డల ఆసుపత్రి

గతంలో లేనిది ఇప్పుడే ఎందుకు..?

జిల్లా ఆసుపత్రిగా లేని సమస్య బాలింతల విషయంలో ఇప్పుడే ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదు. వైద్యులు చెబుతున్న కారణాలు సహేతుకంగా ఉండటం లేదు. బాలింతలు ఉండే చోట సామాన్లు, చూడడానికి వచ్చేవారి కారణంగా ఇన్ఫెక్షన్ వస్తుందని కారణాలు చెబుతున్నారు. వాస్తవానికి జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడూ ఇదేవిధంగా కొనసాగేది. అప్పుడు బాలింతలు ఆరోగ్యంగా ఇంటికి వెళ్లేవారు. ఇప్పుడు ఎందుకు ఈవిధంగా జరుగుతుందో సరైన కారణం మాత్రం చెప్పడం లేదు. ఇటీవల జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ బాలింతలకు పదేపదే కుట్లు వేస్తున్న విషయాన్ని లేవనెత్తారు. ఇప్పటికే బాలింతలకు ఇన్ఫెక్షన్‌పై ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి బాధితులు అనేకసార్లు తీసుకెళ్లారు. అయినా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.

ఆసుపత్రికి రాకూడదంటూ చర్చ

ఇక్కడ ప్రసవం చేసుకున్న మహిళలు ఇంకెవ్వరూ ఇక్కడికి రావొద్దని తమ వద్దకు వచ్చిన వారికి చెబుతున్న పరిస్థితి ఉంది. దీంతో ఆసుపత్రి ప్రతిష్ట రోజురోజుకీ మసకబారుతోంది. ఇదేవిధమైన పరిస్థితులు కొనసాగితే కొంతకాలానికి గర్భిణులు ఈ ఆసుపత్రికి వచ్చే పరిస్థితి ఉండదనే చర్చ సాగుతోంది. ఇన్ఫెక్షన్‌కు సంబంధించి ఆసుపత్రి శుభ్రతపై ఏమైనా టెస్టులు నిర్వహించారా.. వాటిలో తేడాలు వచ్చాయా.. ఏం చర్యలు తీసుకున్నారో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా జిల్లా, ఆసుపత్రి అధికారులు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

శశిధర్, జిజిహెచ్ సూపరింటెండెంట్


బాలింతలకు ఇన్ఫెక్షన్ సమస్య నా దృష్టికి వచ్చింది. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రి బెడ్స్ ఏర్పాటు, పలు విషయాలపై ఆలోచన చేస్తున్నాం.

పెరుగుతున్న గోదావరి వరద

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోదావరి ఉపనదుల జలాలు గోదావరిలో కలుస్తున్నాయి. దీంతో గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరుగుతూ వస్తుంది. శనివారం పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే నుంచి 1,87,051 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 27.920 మీటర్లు, దిగువన 18.470 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్‌కి ఎగువన 28.050 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్‌కి దిగువన 17,300 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 16.040 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు దిగువన 16.49 మీటర్లు నమోదైందని, ప్రస్తుతం పోలవరం గోదావరి క్రమంగా పెరుగుతుందని సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు. ఎగువ కాపర్ డ్యామ్‌కి ఎగువన నీటిమట్టం పెరగడంతో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరు గండి పోశమ్మ ఆలయంలోకి వరద జలాలు చేరుకున్నాయి. దీంతో అధికారులు ఆలయానికి రాకపోకలు బంద్ చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 20.3 అడుగులకు చేరుకుంది.

కుక్కునూరు రూరల్ : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు నిండడం సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదలడంతో గోదావరికి వరద నీరు చేరుతుండటంతో క్రమంగా పెరుగుతుంది. శుక్రవారం భద్రాచలంలో 14 అడుగులు ఉన్న గోదావరి శనివారం క్రమంగా పెరుగుతూ 18.3అడుగులకు చేరుకుంది. గోదావరికి వరద పెరుగుతుండడంతో ముంపు మండలాల రైతాంగం ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



పోలవరం : స్పిల్ వే వద్ద విడుదలవుతున్న నీరు

వేలేరుపాడు : భద్రాచలం వద్ద గోదావరి రెండు రోజుల క్రితం వరకు నిలకడగానే ఉంది. శనివారం 20 అడుగులకు చేరుకోవడంతో గోదావరి పరివాహక ప్రాంతాల్లో అలజడి మొదలైంది. గత అనుభవంతో ఈ ఏడాది ఏ పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని భయం గుప్పెట్లో ముంపు గ్రామాల ప్రజలు నలిగిపోతున్నారు. సుమారు 34 అడుగుల మేరకు చేరుకుంటే వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే మార్గంలో బోళ్లపల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు కాజ్ వే మునిగిపోతే సుమారు 18 గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం లేక బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అలాగే రుద్రంకోట, రేపాక గొమ్ము, తాట్కూరు గొమ్ము తదితర గోదావరి పరివాహ ప్రాంతాల్లో ఇరువైపులా ఒడ్డుల వద్ద గోదావరి ప్రవహిస్తుంది. సరిగా వర్షాలు లేకపోయినా క్రమేపి వరద పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు వరదలు పెరిగిన తర్వాత అప్పటికప్పుడు పునరావాసాల ఏర్పాటు చేయకుండా ముందుగానే పునరావా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ముంపు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు సమిష్టి కృషి అవసరం

జెడ్‌పి ఛైర్‌పర్సన్ జి.పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విద్యారంగంలో ఉత్తమ ఫలితాల సాధనకు సమిష్టి కృషి అవసరమని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో మాధ్యమిక విద్యపై శనివారం జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన జెడ్‌పి ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సామగ్రి సరఫరా, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల మెరుగుదల, జిల్లా పరిషత్ నిధులతో రూపొందించిన విజయకేతనం పుస్తకాల ప్రాముఖ్యత వంటి అంశాలపై చర్చించారు. కొన్ని మండలాల్లో పుస్తకాలు, కిట్ పంపిణీలో ఆలస్యమైనట్లు గుర్తించి వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వేడిగా, నాణ్యంగా ఉండేలా చూడాలని సూచించారు. మెనూ అమలు, శుభ్రత, తాగునీరు, వంటగదుల పరిస్థితులపై పర్యవేక్షణ పెంచాలన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్

ఉపాధ్యాయుల కొరతపై పాఠశాలలవారీగా సమీక్షించి తాత్కాలిక భర్తీకి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సైన్స్, మ్యాథ్స్ వంటి కీలక సబ్జెక్టు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ లేకుండా చూడాలని సూచించారు. పాఠశాలల్లో విద్యుత్, తాగునీరు, క్రీడా సామగ్రి వంటి మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతి ఉపాధ్యాయుడు విద్యాధికారుల పాత్ర ఎంతో కీలకమని ఛైర్‌పర్సన్ అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, డిప్యూటీ సిఇఒ కె.భీమేశ్వరరావు, డిఇఒలు వెంకటలక్ష్మమ్మ, నారాయణ, డివైఇఒలు, సిఇ బోర్డు కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

పరిహారం అందించండి సారూ..!

నిర్వాసిత కుటుంబం ఆవేదన

ప్రజాశక్తి - కుక్కునూరు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల విభజన జరగక ముందు 2017లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సర్వే కోసం కుక్కునూరు మండలాన్ని నాలుగు బ్లాకులుగా విభజించారు. అందులో దాసరి వెంకన్న కుటుంబం నివసించే ప్రాంతాన్ని బి-బ్లాకుగా గుర్తించారు. 2022లో వరదల కారణంగా వెంకన్న నలుగురు కుమారుల గృహాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 41.15 కాంటూర్ స్థాయిలో పరిహారం కోసం రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అంతదించారు. పరిహారం అందించే జాబితాలో వారి గృహాలు చేర్చినా సర్వే నివేదికలు ఇరిగేషన్ శాఖకు పంపినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యే వరకు పరిహారం అందదని స్పష్టం చేశారు. ఈ ఆలస్యంపై దాసరి అప్పారావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ త్వరితగతిన పరిహారం అందించాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్స్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రశాంతమైన వాతావరణంలో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఒంగోలు ట్రిపుల్ ఐటీ అడ్మిషన్స్ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది. రెండో రోజు శనివారం 516 నుంచి 1020 ర్యాంకర్స్ విద్యార్థులను అడ్మిషన్స్ కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ భాస్కర్‌పటేల్ మాట్లాడుతూ తొలిరోజు శుక్రవారం 505 మంది విద్యార్థులకు 434, రెండో రోజు శనివారం 555 మందిలో 397 మంది అడ్మిషన్లు పొందారని తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికాగానే ఈ నెల 14వ తేదీ నుంచి నూజివీడులోనే ఒంగోలు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి మూడు రోజులు ఓరియంటేషన్ తరగతుల ద్వారా ట్రిపుల్ ఐటీ విద్యావిధానం, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కౌన్సెలింగ్ కోసం హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులకు తాగునీరు, అల్పాహారం, భోజనం, కాఫీ, టీ వంటి సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఏ విధమైన ఆటంకాలు ఏర్పడకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ట్రిపుల్ ఐటీ డీన్ ఎం.రూపస్‌కుమార్, పరిపాలన అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.


పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి

9న సార్వత్రిక సమ్మె జయప్రదానికి పలుచోట్ల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పని గంటలు ఎనిమిది నుంచి 10, 12 గంటలకు పెంచడాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని, ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మె విజయవంతం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం నేర్పాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి వ్యవసాయ కార్మికులు, కర్షకులకు పిలుపునిచ్చారు. సిఐటియు, వ్యవసాయకార్మిక సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక నవభారత్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పెట్టుబడీదారుల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు తెచ్చిందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక చట్టాలను తక్షణం రద్దు చేయాలని కోరారు. మోడీకి భజన చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, గుజరాత్ ముఖ్యమంత్రి కార్మికులను పెట్టుబడిదారులకు తొత్తులుగా మార్చేందుకు 8 గంటల పని దినాన్ని 10, 12 గంటలకు పెంచి కేబినెట్‌లో ఆమోదించడం కార్మికులకు వెన్నుపోటు పొడవడమేనని అన్నారు. తక్షణమే లేబర్ కోడ్‌ల అమలు ఆపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, ఆటో కార్మికులు, హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రయివేట్ విద్యాసంస్థలు, హాస్పిటల్స్, మాల్స్, షోరూమ్‌ల్లో పని చేస్తున్న కార్మికులకు చట్టప్రకారం కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి, అధ్యక్షులు సూర్యారావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, నేత పిల్లి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



పోలవరంలో....

పోలవరం: ఈ నెల 9న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ఉద్యోగ సంఘాలు చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం స్థానికంగా సిఐటియు ఆధ్వర్యంలో వివిధ రంగాల ముఖ్యకార్యకర్తల సమావేశం పిఎల్ఎస్.కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా పని గంటల పెంపుతో భారం మోపడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు రకాల యాప్‌ల పేరుతో ఇబ్బంది పెట్టడం సరైంది కాదన్నారు. తక్షణమే ఇబ్బందికరంగా ఉన్న యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం సమ్మె జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వ్యకాస నేత కారం భాస్కర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు సిహెచ్.కుసుమ, పంచాయతీ వర్కర్స్ నాయకులు ఫణి తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో...

ఉంగుటూరు: కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఈ నెల 9న సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. శనివారం మండలంలో అంగన్వాడీ, ఆశాలు, ఆటో, ఫ్యాక్టరీ కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మిక చట్టాలు అమలులో ఉన్నప్పటికీ కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తూ అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే కార్మికులకు బానిసత్వమే గతి అని అన్నారు. లేబర్ కోడ్‌ల రద్దు కోసం జరిగే సమ్మెలో ప్రతి కార్మికుడూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు, మండల అధ్యక్షులు సీరా అప్పారావు, నాయకులు సుజాత, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో...

ముసునూరు: ఈ నెల 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ముసునూరు పోస్టాఫీస్ సెంటర్ వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిఒక్కరూ ఈ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కొడవల శ్రీనివాస్, కంచర్ల దుర్గారావు, రమేష్, కంచర్ల శ్రీను, సత్యనారాయణ, నిమ్మగడ్డ సాంబయ్య, కూతాటి ఏడుకొండలు, కంచర్ల పంగిడియ్య, రంగారావు, శ్రీను, శివప్రసాద్ పాల్గొన్నారు.

ముదినేపల్లి: కార్మిక చట్టాలను కాలరాస్తే ఊరుకునేది లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళి అన్నారు. ముదినేపల్లి ఎంపిడిఒ కార్యాలయం వద్ద 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలంటూ శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.అరుణకుమారి, నేతలు బండి పద్మ, కె.విజయలక్ష్మి, పి.సరస్వతి, ఎన్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మండవల్లి: పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.విజయలక్ష్మి స్పష్టం చేశారు. సిఐటియు మండల అధ్యక్షురాలు చెల్లాయమ్మ అధ్యక్షతన సిఐటియు మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. 9న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిహెచ్.ఉమాదేవి, పి.లక్ష్మీ, శివపార్వతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

చింతలపూడిలో సిపిఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - చింతలపూడి

రైతులకు, కార్మికులకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం వల్ల న్యాయం జరుగుతుందని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. చింతలపూడిలో సిపిఐ జిల్లా ద్వితీయ మహాసభ శనివారం ఘనంగా ప్రారంభించారు. చింతలపూడి షాదీఖానా వద్ద నుంచి ఫైర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీల సంప్రదాయం డోల్ కోయలు, రేలాట, కొమ్ములాటలు ఆకట్టుకున్నాయి. డప్పు కళాకారులు, ప్రజానాట్య మండలి కళాకారులు పాటలు, నాట్యలతో అలరించారు. అల్లూరి సీతారామరాజు గురించి వేసిన నాటకం ఆకట్టుకుంది. సిపిఐ మండలాధ్యక్షులు తొర్లపాటి బాబు స్వాగతం పలకగా జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బడుగు బలహీన తరగతులు, కార్మికులు, రైతులు, ప్రజల తరపున సిపిఐ పోరాటం చేస్తుందని తెలిపారు. మోడీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. కమ్యునిస్ట్ పార్టీల పాలన దేశానికి చాలా అవసరమన్నారు. బిజెపి వంటి హిందుత్వ శక్తులను అడ్డుకోవటం కమ్యూనిస్టులకే సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలేదన్నారు. ప్రతిపక్షంలో ఉనప్పుడు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ మీటర్లు వద్దని చెప్పి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచిందని, స్మార్ట్ మీటర్లు బిగిస్తుందని చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల నిర్వాసితులకు, ప్రజలకు న్యాయం చేయాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ నాయకులు వసంతరావు మాట్లాడుతూ చింతలపూడిలో బస్సు డిపో ఏర్పాటుచేసి రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంతో చింతలపూడిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రింగ్ రోడ్డు నిర్మించాలని కోరారు. జాతీయ కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెవిపి.ప్రసాద్, డేగ ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రామారావు, బండి వెంకటేశ్వరరావు, కలిసెట్టి వెంకటరావు, ఎండి.మునీర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చియ, ఆహ్వాన సంఘం అధ్యక్షులు మామిళ్లపల్లి వసంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరు హేమశంకర్, మహిళా సమైక్య రాష్ట్ర కార్యదర్శి యామిని, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, పుప్పాల కన్నబాబు, బాడిస రాము, సన్నేపల్లి సాయిబాబా, కారం ధారయ్య, జె.రమణరాజు, వెంకటాచారి, సర్పంచి పిట్టా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో అభివాదం చేస్తున్న సిపిఐ నేతలు

అష్టకష్టాలు.. స్పందించని పాలకులు..!



పాఠశాలల, తరగతుల విలీనంతో విద్యార్థులు, ధాన్యం సొమ్ములు అందక రైతులు అష్ట కష్టాలు పడుతున్నా పాలకుల నుంచి సరైన స్పందన లేకుండా పోయింది. వాళ్ల సంగతి పక్కన పెట్టి జిల్లా అధికారులైనా స్పందిస్తారంటే అదీ లేకపోవడంతో రెండు జిల్లాల్లో ఆయా తరగతుల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పాఠశాలల, తరగతుల విలీనంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా సమీప పాఠశాలల్లోనే అంటే అర కిలోమీటరు దూరంలోనే కొన్ని తరగతులను విలీనం చేసినా, అక్కడికి వెళ్లడానికి ప్రధాన రహదారులు దాటాల్సి రావడం, లేదా కాల్వల పక్కగా రాకపోకలు సాగించాల్సి రావడంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మండల, డివిజన్ విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు పంపారు. వాటిలో ఈ ఇబ్బందులను సైతం పేర్కొన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. అయితే అవేమీ పట్టని పాలకులు తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అనే చందంగా పాఠశాలల, తరగతుల విలీన ప్రక్రియ కానిచ్చేశారు. అదే సమయంలో ఎక్కడైనా అధికార పార్టీ ఎంఎల్‌ఎలు జోక్యం చేసుకుంటే వాటి వరకూ కొంత ఆగింది. మిగిలిన చోట్ల ఈ విలీన ప్రక్రియ అధికారుల మెడకు చుట్టుకుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. విలీనానికి వ్యతిరేకంగా ఆందోళనలు సాగుతున్నా జిల్లా అధికారులు స్పందించకపోవడంతో మండలాధికారులు సర్దిచెప్పలేక నానాతంటాలు పడుతున్నారు. ఇదే కోవలో పెనుమంట్రలోని ఎల్ఇ పాఠశాలలోని 3, 4, 5 తరగతులను సమీప పాఠశాలలో విలీనం చేయడంపై ఇప్పటికీ ఆందోళనలు సాగుతున్నాయి.

ఇక ఉపాధ్యాయుల బదిలీలు సక్రమంగా, సమతూకంగా సాగలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏజెన్సీలోని కుక్కునూరు మండలంలో పెద్దసంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ కావడమే దీనికి నిదర్శనం. 114 ఉపాధ్యాయ పోస్టులకుగాను 38 మంది ఉపాధ్యాయులే ఉండటం, వారిలో 18 మంది డిప్యూటేషన్‌పై వెళ్లి పని చేస్తున్న వారే కావడం అక్కడి పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు జిల్లా అధికారులు అక్కడి ఖాళీల భర్తీ ఎలా చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.


ఇదిలా ఉండగా ఏలూరు నగరంలో ఉర్దూ పాఠశాలలో ఉర్దూ మీడియంలో బోధించే ఉపాధ్యాయులను ఇంగ్లీష్ మీడియంలో బోధించే పాఠశాలకు బదిలీ చేయడం, ఇంగ్లీష్ మీడియంలో బోధించే ఉపాధ్యాయులను ఉర్దూ పాఠశాలకు బదిలీ చేయడం సరికొత్త తలనొప్పిని తీసుకొచ్చింది. అడ కత్తెరలో పోకచెక్కలో విద్యాశాఖాధికారుల నిర్వాకం వల్ల విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధి కారులు ప్రయోగాలు మాని విద్యారంగ అభివృద్ధికి దోహద పడే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇక సార్వా సాగు పనులు ప్రారంభమయ్యాయి. ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నామని సిఎం నుంచి మంత్రులు, ఎంఎల్‌ఎలు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. అయితే మే రెండో వారం నుంచి రైతులకు ధాన్యం సొమ్ము జమ నిలిచిపోయింది. ఇటీవల రైతులు ఆందోళన చేపడితే రూ.500 కోట్ల బకాయిలకుగాను సగం వరకూ చెల్లించినట్లు రైతులు చెబుతున్నారు. మిగిలిన సగం ఎప్పటికి చెల్లిస్తారో, సార్వా సాగు ఎప్పుడు ప్రారంభించాలోనని రైతులు తల్లడిల్లుతున్నారు. ఇప్పటికైనా గొప్పలు మాని పాలకులు, అధికారులు అటు విద్యార్థులు, ఇటు రైతుల సమస్యలు పరిష్కరించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు : ఎస్ఎఫ్ఐ



వినతిపత్రం అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - కుక్కునూరు

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొలిశెట్టి లెనిన్ అన్నారు. కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై 23 రోజులు గడిచినా మండలంలోని పాఠశాలల్లో 96 టీచర్ పోస్టులు ఖాళీగా ఉండటం, ఇన్‌ఛార్జ్ ఎంఇఒ, బాబూరావు పాఠశాలలను సందర్శించకపోవడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నిర్లక్ష్యం ప్రభుత్వ విద్యా సంస్థలను బలహీనపరిచి, ప్రయివేట్ స్కూళ్లను ప్రోత్సహించేలా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీ పోస్టులను స్థానిక నిరుద్యోగులతో తాత్కాలికంగా భర్తీ చేయాలని, రెగ్యులర్ ఎంఇఒను నియమించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. లేకుంటే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఉద్యమాలను ఉధృతం చేస్తామని లెనిన్ హెచ్చరించారు.

రాజీ మార్గమే రాజ మార్గం

జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఏర్పాటుచేసిన ప్రారంభ సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ కక్షిదారుల సౌలభ్యార్థం కోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 35 బెంచీలను ఏర్పాటు చేసి త్వరితగతిన కేసుల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని తెలిపారు. కక్షిదారులు తమ కేసుల వివరాలతో సంబంధించిన బెంచీలు ద్వారా కేసుల పరిష్కరించుకోవాలని సూచించారు. శనివారం ఎంఏసిటి ప్రమాద బీమా కేసులో రూ.85 లక్షల పరిహారం చెల్లించినట్లు చెప్పారు. గోజిట్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు బాధితులకు పరిహారం చెల్లిస్తున్నారని తెలిపారు.

చింతలపూడి : స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 264 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు కోర్టు భవనంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ మాట్లాడుతూ రాజీమార్గం గొప్ప రాజమార్గంగా గుర్తించాలన్నారు. లోక్ అదాలత్ 918 కేసులు పరిష్కరమయ్యాయని తెలిపారు.

వైసిపి రైతు విభాగ నియోజకవర్గ అధ్యక్షులుగా సుబ్బయ్య

నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా సుజన కుమారి

నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా సత్యేశ్వరరావు







ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆదేశానుసారం మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో శనివారం వైసిపి నూజివీడు నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులుగా మండల పరిధిలోని ఈదులగూడెం గ్రామ మాజీ సర్పంచ్ ఈలప్రోలు వెంకట సుబ్బయ్యను, నూజివీడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా ఆగిరిపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు తుటిమెల్లి పావనజ్యోతి సుజన కుమారిని, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆగిరిపల్లికి చెందిన వాకా సత్యేశ్వరరావును నియమించారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పంపిన నియామక పత్రాలను వారికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ పదవులను అప్పజెప్పినందుకు జగన్‌కు, ప్రతాప్ అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి

ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ రాష్ట్ర ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కృష్ణా జిల్లా ప్రతినిధులు ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడుకు స్థానిక ఆర్‌టిసి జోనల్ ఛైర్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు వైద్య సేవల కోసం, కుటుంబ అవసరాల నిమిత్తం తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తోందని, ఈ నేపథ్యంలో సాధారణ బస్సులతో పాటు సూపర్ లగ్జరీ బస్సుల్లో కూడా రిటైర్డ్ ఉద్యోగులు, వారి భార్యాభర్తలకు ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. రెడ్డి అప్పలనాయుడు సానుకూలంగా స్పందించి ఈ దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ తరపున జోనల్ ఛైర్మన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల గంగాధరరావు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో కృష్ణా జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి, రాష్ట్ర స్థాయి నాయకులు ఉన్నారు.

ఆర్‌డిసి డిపో పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ఎపిఎస్ ఆర్‌టిసి బస్టాండ్, గ్యారేజీని ఆర్‌డి టి.చంగల్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్యారేజీలోని సిబ్బందితో గేట్ మీటింగ్ ఏర్పాటు చేసి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బస్సుల సామర్థ్యాన్ని మరింతగా పెంపు చేయాలని సూచించారు. అందుకు అవసరమైన రీతిలో అన్ని ఏర్పాట్లు కొనసాగించాలన్నారు. గ్యారేజీలో పర్యటించి ప్రతి అంశాన్ని పరిశీలించారు. తగిన సలహాలు సూచనలు అందించారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయడంతో పాటు, మురుగునీరు బయటకు ప్రవహించేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎం జి.రాంబాబు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఆయనను దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, పలు అర్జీలు పత్రికలు అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకుని సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడుతామని భరోసా ఇచ్చారు.

నేరాలు - ఘోరాలు

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని మెర్సపూడిలో వ్యాన్ ద్వారా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పివిఎస్ డిటి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. నూజివీడులో ఆయన శనివారం మాట్లాడుతూ 2.50 టన్నుల అక్రమ రేషన్ బియ్యం వ్యాన్ ద్వారా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. వ్యానును స్వాధీనం చేసుకుని, అక్రమ రేషన్ బియ్యం తరలింపునకు కారకులైన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. నిరుపేదల ఆకలి తీర్చే రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించే వ్యక్తులపై ప్రభుత్వం ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

9న దేశవ్యాప్త సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని గోద్రెజ్ ఆగ్రోవెట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్మికుల సమావేశం సీతానగరం పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద శనివారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న యూనియన్ గౌరవ అధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తూ కార్మికులకు ద్రోహం, పారిశ్రామికవేత్తలకు మేలు చేస్తున్నాయన్నారు. యూనియన్ అధ్యక్షులు పి.బాలకృష్ణ మాట్లాడుతూ ఫ్యాక్టరీ కార్మిక వర్గం మొత్తం ఈ నెల తొమ్మిదో తేదీన సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. యూనియన్ కార్యదర్శి పి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

జంగారెడ్డిగూడెం : ఈ నెల తొమ్మిదో తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి నేతలు పిలుపునిచ్చారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా అధ్యక్షులు, ఎఐటియుసి మండల కార్యదర్శి కుంచె వసంతరావు ఆధ్వర్యంలో స్థానిక జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం కమిషనర్‌కు శనివారం సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల మూడో తేదీ నుంచి 14వ తేదీ వరకు దశలవారి కార్యక్రమం, 15వ తేదీన చలో విజయవాడ నిమిత్తం కమిషనర్‌కు మెమోరాండం ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జెవి.రవణరాజు, బాబు, మున్సిపల్ వర్కర్స్ ఇంజినీరింగ్ అధ్యక్షులు కంతేటి వెంకటరావు, కార్యదర్శి నిమ్మల సుబ్బారావు, పారిశుధ్య విభాగం ఉపాధ్యక్షులు సురేష్, కార్యదర్శి బొక్కా శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : ఈ నెల తొమ్మిదో తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర నాయకురాలు మొడియం నాగమణి పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఇఒలు కె.శ్రీనివాస్, బుచ్చయ్యలకు వినతిపత్రాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చిట్టి బొమ్మ కొండలరావు, మధ్యాహ్న భోజన పథకం మండల కార్యదర్శి రాయల అనసూర్య, కాగితాల మురళి, వెంకటేశ్వరి, సువార్త, గంధం కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ డే

ప్రజాశక్తి - ముసునూరు

ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా అంగన్వాడీ సెంటర్లలో అవగాహన కల్పిస్తున్నట్లు సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి చెప్పారు. మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు అంగన్వాడీ కేంద్రంలో ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయిని పి.రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల ద్వారా మురుగు నీరు

గూటాల వాసుల ఆందోళన

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు మురుగు నీరు తాగే పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వర్షపు నీరు బయటకు పంపించడానికి మురికి నీటి కాలువలు పూడికతీత పనులు చేస్తున్నారు. అదే సమయంలో అక్కడ ఉన్న పంచాయతీ తాగునీటి పైపులైనకు రంధ్రం పడింది. దీంతో మురికి నీటి కాలువలో ఉన్న దుర్గంధపు నీరు పైపులైను రంధ్రం గుండా వెళ్లి తాగునీటిని కలుషితం చేస్తున్నాయి. దీంతో కుళాయి ద్వారా మురికి నీరు రావడంతో గ్రామస్తులు పంచాయతీ దృష్టికి తీసుకెళ్లారు. ఇది జరిగి 15 రోజులు కావస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు శనివారం ఆందోళనకు దిగారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి తాతీ విజయకుమారిని వివరణ కోరగా ఇప్పటికే పనులు జరుగుతున్నాయని, వెంటనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

సూర్యావతి జీవితం నేటి మహిళలకు ఆదర్శం

ప్రజాశక్తి - టి.నరసాపురం

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు మానుకొండ సూర్యవతి నేటి మహిళలకు ఆదర్శమని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి అన్నారు. సూర్యవతి 32వ వర్ధంతి సభ స్థానిక ఎస్ఆర్ నగర్‌లో ఐద్వా మండల కార్యదర్శి మడకం కుమారి అధ్యక్షతన నిర్వహించారు. సూర్యవతి చిత్రపటానికి శ్యామలారాణి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మండ్రు శిరీష, బరగడ కుమారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తహశీల్దార్ టి.సాయిబాబా తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రధానోపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సాయి బాబా మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు ఐదేళ్లు నిండిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించడానికి కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థులందరినీ బడిలో చేర్పించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

క్షయ వ్యాధిపై జాగ్రత్తగా ఉండాలని టీబీ నియంత్రణ పర్యవేక్షకులు అంబేద్కర్ అన్నారు. సిద్ధార్థ ఒకేషనల్ జూనియర్ కాలేజీ కరెస్పాండెంట్ దాసరి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో, ప్రిన్సిపల్ దోమతోట్టి విజయకుమార్ అధ్యక్షతన శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీబీ హెచ్‌వి సోనీ, కాలేజీ ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం యూనియన్ బ్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి 15 అడుగుల విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఎంపిపి గంజిమాల రామారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఏలూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జి కారుమూరి సునీల్ కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, కంభం విజయరాజు, తెల్లం బాలరాజు పాల్గొన్నారు.

భారీ వాహనాలు రాకుండా గెడ్డర్లు బిగింపు

ప్రజాశక్తి వరుస కథనాలకు స్పందన



బిగించిన గెడ్డర్లు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం కాలువ గట్టు రోడ్డులో భారీ వాహనాలు రాకుండా పంచాయతీ ఆధ్వర్యంలో గెడ్డర్లు శనివారం బిగించారు. ఏలూరు కావలుపై శిథిలమైన వంతెన మూసేసిన కారణంగా అన్ని వాహనాలు ఈకాలువ గట్టు రోడ్డు వెంబడే ప్రయాణిస్తున్నాయి. దీంతో సింగిల్ లైన్‌గా ఉన్న ఈ మట్టి రోడ్డులోనే గత్యంతరం లేక కారులు, లారీలు, ఆటోలు, పాఠశాలలు, కళాశాలల బస్సులు తిరుగడటంతో తరుచూ ఇరుకు కారణంగా ట్రాఫిక్ సమస్య వస్తోంది. అంతేకాకుండా వందలాది ఎకరాలకు సాగునీటిని అందించే సాగునీటి టన్నెల్ ఈ రోడ్డు మార్గంలోనే ఉంది. 25 నుంచి 35 టన్నులు ఉండే భారీ వాహనాలు తరచూ దిగబడి యూటీ దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న క్రమంలో ప్రమాదపు అంచున సాగునీటి టన్నెల్ అని ఈ నెల 4న ప్రజాశక్తిలో కథనం వచ్చింది. ఈ నేపథ్యంలో సర్పంచి దిడ్ల అలకనంద శ్రీను ఆధ్వర్యంలో శనివారం ఇనుప గెడ్డర్లను తెచ్చి బిగించారు. సచివాలయం-2 కార్యదర్శి గోపీశెట్టి కార్తీక్, సిబ్బందితో పాటు వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. భారీ వాహనాలు రాకుండా గెడ్డర్లు బిగించడం పట్ల స్థానికులు పంచాయతీకి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే 14వ వార్డులో మట్టి రోడ్డును సిమెంటు రోడ్డుగా మార్చాలని నెక్కంటి కృష్ణ తదితరులు కోరారు. ప్రతిపాదనలు పంపామని, నిధుల లభ్యతను బట్టి నిర్మిస్తామని సర్పంచి వెల్లడించారు.

కౌలు రైతుల కోసం నిధులు కేటాయించాలి

సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా పంట రుణాలివ్వాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2025 -26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లా బ్యాంకర్ల వ్యవసాయ వార్షిక రుణ ప్రణాళికలో కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు అన్నే భవనంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావుతో ఆయన కలిసి మీడియాతో మాట్లాడారు. జిల్లా బ్యాంకర్లు విడుదల చేసిన వార్షిక వ్యవసాయ పంట రుణ ప్రణాళికలో రూ.8,396 కోట్లు రైతులకు ఇస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేశారు. నూటికి 70 శాతం భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని చెప్పారే తప్ప నిర్దిష్టమైన కేటాయింపులు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు సాగు చేయని భూ యజమానులకు పంట రుణాలు మంజూరు చేసిన తర్వాత బ్యాంకర్లు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. ఎటువంటి హామీ లేకుండా సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా పంట రుణాలు ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలు జారీ చేసినా జిల్లాలో బ్యాంకర్లు అమలు చేయడం లేదన్నారు. రొయ్య రైతులకు కనీస ధరలు రాక నష్టపోతున్నారని, రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. వర్జీనియా పొగాకుకు సరాసరి ధర రూ.400 కల్పించి పొగాకు రైతులను ఆదుకోవాలన్నారు.

అర్హులందరికీ సొంతింటి కల సాకారమే లక్ష్యం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి ఏలూరు సిటీ

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులందరికీ సొంతింటి కలసాకారం చేసే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. సంతృప్తికర పాలనే ధ్యేయంగా పేదలను అన్నివిధాలా ఆదుకునేందుకు పి-4 కార్యక్రమాన్ని కూడా ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు చెప్పారు. స్థానిక మూడో డివిజన్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ బడేటి చంటి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఇంటింటి పర్యటనను ప్రారంభించారు. ఏడాదికాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని పంచాయతీ కార్యదర్శులు

సర్వసభ్య సమావేశంలో జెడ్‌పిటిసి ప్రతాప్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి ప్రతాప్

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టే సమయంలో ప్రోటోకాల్ ప్రకారం జెడ్‌పిటిసి సభ్యులకు, ఎంపిటిసి సభ్యులకు పంచాయతీ కార్యదర్శులు సమాచారం ఇవ్వడంలేదని జెడ్‌పిటిసి సభ్యులు వరికూట ప్రతాప్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎంపిపి కొండా దుర్గాభవాని ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం ద్వారా ప్రజా సమస్యలతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, పలు విషయాలు ప్రజలకు తెలుస్తాయని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. ప్రోటోకాల్ పాటించి తమకు సమాచారం ఇవ్వాలని జెడ్‌పిటిసి ప్రతాప్ కోరారు. వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వరి పంట 6500 ఎకరాల్లో, పత్తి పంట 4900 ఎకరాల్లో సాగవుతున్న నేపథ్యంలో దిగుబడి పెంచుకునేందుకు ప్రతి రైతూ జీలుగు, పెసర, ఫిడిపి విత్తనాలను భూమిలో చల్లితే ఉపయోగకరమన్నారు. ఎంఇఒ సుబ్బారావు మాట్లాడుతూ 6,810 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో తల్లికివందన సొమ్ము జమ అయిందని చెప్పారు. వైద్యాధికారిణి షకీలా ఇవాంజిలిన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నూజివీడు నుంచి ఏలూరు వెళ్లే ఆర్అండ్‌బి రహదారి చాలా అధ్వానంగా ఉందని తహశీల్దార్ కె.వెంకటరమణ ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకొచ్చారు. ఆర్అండ్‌బి ఎఇ మాట్లాడుతూ 2021లో రూ.47 కోట్లు మంజూరు కాగా గత ప్రభుత్వం అలసత్వం వహించడం వల్లే ఆ రోడ్డు దుర్భరంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండలాధ్యక్షుడు గద్దె రఘుబాబు, వైస్ ఎంపిపపి-2 పాములు గంగాధరరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రామా కేర్ సెంటర్ అందుబాటులోకి తేవాలి

ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మొగళ్లపు నరసయ్య మెమోరియల్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో శనివారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఏజెన్సీ గ్రామాలకు ముఖ ద్వారమైన జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిని అన్ని సౌకర్యాలు కలిగిన ఆసుపత్రిగా అందుబాటులోకి తీసుకురావాలని చర్చించారు. ఈ విషయంపై ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్, ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ ప్రభుత్వానికి నివేదిక పంపించారని, సాధ్యాసాధ్యాలా ప్రకారం ప్రభుత్వాసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ అందుబాటులోకి తీసుకురావాలని సభ్యులు కోరారు. రానున్న రోజుల్లో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్లు కంచర్ల గణేష్, నాయుడు శ్రీను, కోటగిరి ప్రమీల, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణ, హాస్పటల్ సూపరింటెడెంట్ డాక్టర్ బేబి కమల,పాల్గొన్నారు.

ప్రేమ జంటపై దాడి

ఆందోళనలో బంధువులు

ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - కైకలూరు

మేజర్ల పెళ్లి వ్యవహారం వివాదాస్పదంగా మారింది. కొందరు వ్యక్తులు ప్రేమ జంటపై దాడులు జరపడంతో గాయాలపాలైన బాధితులు ఆసుపత్రిలో చేరి ఆందోళన చేశారు. ఈ సంఘటన కైకలూరు మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... కైకలూరు మండలం చటాకాయకు చెందిన యువకుడు, నత్తగుల్లపాడుకు చెందిన యువతి ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వారి ప్రేమ విషయం తల్లిదండ్రులకు చెప్పగా వారు అంగీకరించలేదు. దీంతో వారు నెల్లూరులో ఉంటున్న బంధువుల వద్దకు వెళ్లి వివాహం చేసుకున్నారు. అనంతరం తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలంటూ బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. అప్పటికే యువతి తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించడం లేదంటూ కైకలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మేజర్లు ఇద్దరు ఒకే సామాజిక తరగతికి చెందినవారు కావడంతో చటాకాయ గ్రామానికి చెందిన పెద్దలు నెల్లూరు వెళ్లి ప్రేమ జంటతో మాట్లాడి ఇంటికి తీసుకొస్తున్నారు. ఇదే క్రమంలో అమ్మాయి బంధువులు కూడా అమ్మాయి ఆచూకీ కోసం వెతుకుతూ ఇరు గ్రూపులు ఒంగోలులో కలుసుకొని ఇంటికి వెళ్లి మాట్లాడుకుందామని గ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో ఏలూరు కైకలూరు ప్రధాన రహదారిలో ఉన్న బుడమేరు వంతెన వద్దకు వచ్చేసరికి యువతి బంధువులు ప్రేమ జంట ఉన్న కారుకు అడ్డుపెట్టి ప్రేమ జంటను, చటాకాయ గ్రామ పెద్దలను బయటకు లాగి సినీ పక్కీలో చితకబాదారు. వివాహితను ఏలూరులోని బంధువుల వద్దకు బలవంతంగా తీసుకెళ్లిపోయారు. అనంతరం దాడిలో గాయపడిన వ్యక్తులను స్థానికులు కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తామంతా ఒకే సామాజిక తరగతికి చెందినవారమని, ఇంటి వద్ద మాట్లాడుకుందామని వస్తుండగా కార్లు అడ్డగించి మాపై దాడికి దిగాల్సిన అవసరం ఎవరికి వచ్చిందని ప్రశ్నించారు. దాడి చేసిన వారు ఎవరంటూ ఆందోళనకు దిగారు. వివాహితను పిలిపించి వివరాలను సేకరిస్తామని పోలీసులు చెప్పడంతో ఇరు గ్రూపులవారు కాస్త శాంతించారు. అయినప్పటికీ కొట్టిన వ్యక్తులు ఎవరు అనేది తెలుస్తారా సర్దుకుంటారా అనేది ప్రశ్నార్థంగా ఉంది.

నేడు పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్

మండవల్లి : పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా ఉంటామని పశు సంవర్ధక శాఖ ఎడి వరప్రసాద్ స్పష్టం చేశారు. ఈ నెల ఆరో తేదీ ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి రాకుండా ఉచితంగా వ్యాక్సిన్ వేస్తున్నామని అన్నారు.